ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు, సీఐ జగదీశ్

ఇబ్రహీంపట్నం, మార్చి 4 : నేటినుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. నియోజకవర్గంలో 16 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఇబ్రహీంపట్నంలో 8, ఆదిబట్లలో 5, యాచారంలో 1, మాడ్గులలో రెండు చొప్పున పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమగురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, వాసవీ జూనియర్ కళాశాల, వసుందర జూనియర్ కళాశాల, శ్రీ విద్యాంజలి జూనియర్ కళాశాల, కార్తికేయ జూనియర్కళాశాల, కార్తికేయ జూనియర్ కళాశాల, శ్రీ గురు జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలతో పాటు ఆదిబట్లలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల, ఆగస్త్యా జూనియర్ కళాశాలతో పాటు యాచారం జూనియర్ కళాశాల, మాడ్గుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, మాడ్గుల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఆమనగల్లు, మార్చి 4: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నడంతో ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం టేబుళ్లపై హాల్ టికెట్ నంబర్లు వేయడంతో పాటు నంబర్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరంలో 1387 మంది, ద్వితీయ సంవత్సరంలో 1300 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పరీక్షల సీఎస్ మాధవరావు తెలిపారు. విద్యార్థులు 8.30 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

సురంగల్, మొయినాబాద్ గ్రామాల్లో మున్సిపల్ అధికారుల పర్యటన
కలుషిత సమస్యలు రావొద్దని ఆదేశాలు

మొయినాబాద్, మార్చి 4 : తాగునీటి పైప్‌లైన్ లీకేజ్‌లు, తాగునీటి బోరు చుట్టూ మురుగు నీరు చేరి ''తాగునీరు కలుషితం'' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మొయినాబాద్ గ్రామంలో ఆశీర్ ఖాన వెనుక భాగంలో తాగునీటి బోరు చుట్టూ మురుగు నీరు చేరి బోరులోకి వెళుతుండగా, సురంగల్ గ్రామంలో తాగునీటి పైపు లైన్ గేట్ వాల్వ్ లీకేజీ కావడంతో కలుషితం అయిన మురుగు నీళ్లు పైపు లైన్‌లో కలుస్తున్నాయని సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ పారిశుధ్య నిర్వహణ అధికారి సంధ్య పరిశీలించారు. ఈ నివేదికను మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజూద్దీన్‌కు అందించారు. దీంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజూద్దీన్ మొయినాబాద్ గ్రామంతో పాటు సురంగల్ గ్రామంలో పర్యటించారు. మొయినాబాద్‌లో తాగునీటి బోరు చుట్టూ మురుగు నీరు చేరకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. అదే విధంగా సురంగల్ గ్రామంలో లీకేజీ అయిన తాగునీటి పైప్ లైన్ గేట్ వాల్వ్ మరమ్మతు పనులను పరిశీలించి మరమ్మతులు చేయించారు. ఎక్కడా పైప్‌లైన్ లీకేజీ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజూద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్ గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. అందులో భాగంగా గ్రామాల్లో ఉండే నర్సరీలు, తాగునీటి నిర్వహణను పరిశీలించారు. నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండకాలంలో మంచినీటి సమస్య తీవ్ర తరం అయ్యే అవకాశం ఉందని ప్రజలు తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది సోమశేఖర్, మహేశ్, మాజీ ఉపసర్పంచ్‌లు అంజిరెడ్డి, యాలాల జైపాల్‌రెడ్డి, నాయకులు భాస్కరాచారి పాల్గొన్నారు.

మొయినాబాద్‌లోని సురంగల్‌లో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజూద్దీన్

రైతు బీమా ప్రీమియం చెల్లించాలి

కేశంపేట, మార్చి 4: ప్రభుత్వం రైతు బీమా ప్రీమియం డబ్బులు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ మండలం కార్యదర్శి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు బీమా డబ్బులను ప్రభుత్వం ఎల్ఐసీకి చెల్లించకపోవడంతో ఇటీవల మృత్యువాత పడుతున్న రైతులకు బీమా డబ్బులు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్ఐసీకి బకాయి ఉన్న రూ.750కోట్లను చెల్లించి రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు.

ఆర్థిక సహకారం

కడ్తాల్, మార్చి 4: తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో పేద కుటుంబానికి చెందిన సందీప్, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. విద్యార్థి కుటుంబ ఆర్థిక సమస్యలను ఇటీవల మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, ట్రస్ట్ సభ్యుడు మధు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం సందీప్ ఉన్నత చదువు కోసం ట్రస్ట్ తరపున రూ.15 వేల చెక్కును ఆయన అందజేశారు. అదే విధంగా మాడ్గుల్ మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జానార్దన్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ స్థానిక నాయకులతో కలిసి బాధితుడిని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. ఆయన వెంట సుధాకర్, వంశీ, విష్ణువర్దన్‌రెడ్డి, రాజవర్దన్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య ఉన్నారు.

కర్కల్‌పహాడ్‌లో..

కడ్తాల్ : మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన సిలివేరు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు స్థానిక కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు శ్రీనివాస్ మృతదేహం వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు బాల్‌రెడ్డి, విక్రంరెడ్డి, రమణరెడ్డి, బస్వారెడ్డి, గోపాల్, రామకృష్ణ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట, మార్చి 4: మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పబ్బెజంగయ్య(50) మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలను అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు ఉదయ్, దశరథ్, నర్సింహ, శ్రీశైలం, మాధవ్, సురేశ్, ఆసీఫ్, కరుణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి..

మాడ్గుల, మార్చి4: మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లేటి జనార్ధన్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారకం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌గుప్తా మంగళవారం బాధితుడిని పరామర్శించి, భార్య కవితకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలోని విష్ణువర్దన్‌రెడ్డి, రాజవర్దన్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, వెంకటయ్య, వంశీ పాల్గొన్నారు.

బీరప్పగుడి నిర్మాణానికి విరాళం

కొత్తూరు, మార్చి 4: మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఎస్‌బీపల్లికి చెందిన రియల్టర్ శ్రీశైలం రూ. లక్షా ఒకవేయి పదహారు రూపాయల విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రాజు, మాజీ వార్డు మెంబర్ శ్రీశైలం, కురుమ సంఘం కమిటీ అధ్యక్షుడు అజయ్, మల్లేశ్ ఉన్నారు.

నీటిలో పడి వ్యక్తి మృతి

చేవెళ్లటౌన్, మార్చి 4 : పుష్కరిణిలో స్నానం చేయడానికి వెళ్లి కాలుజారి నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన కురువ బిచ్చప్ప (45) కూలీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. శివరాత్రి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న జాతరకు భార్యతో వెళ్దామని చెప్పడంతో ఆమె సాయంత్రం వెళ్దామని భర్తతో చెప్పి కూలీపనికి వెళ్లిపోయింది. బిచ్చప్ప ఒక్కడే పుష్కరిణిలో స్నానం చేయడానికి వెళ్లగా, కాలుజారి నీటిలోపడి మృతి చెందాడని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ రాజు

మంచాల, మార్చి 4: చెడు వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మంగళవారం మంచాల మండలం అస్మత్‌పూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్, ఆన్‌లైన్‌గేమ్ తదితర వాటిపై యువత, విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువత చెడు మార్గాల వైపు వెళ్లకూడదని చెప్పారు. ముఖ్యంగా గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడితే కుటుంబాలు వీధిన పడుతాయని తెలిపారు. తల్లిదండ్రులు నిరంతరం పిల్లలను గమనిస్తూ ఉండడమే కాకుండా వారికి సాధ్యమైనంత వరకు ఫోన్లు ఇవ్వకూడదని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలాలయ్య, ఏఎస్సై సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్

కడ్తాల్, మార్చి 4: కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. మండలంలో పడకల్ గ్రామానికి చెందిన హరికృష్ణ, గోవిందాయిపల్లిలో జంగయ్య, ఏక్వాయిపల్లి గ్రామంలో నర్సింహాగౌడ్, సాయికుమార్ తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వీరందరూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు సీఐ అప్పగించారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసిన కానిస్టేబుల్ రాంకోటిని పోలీసులు అభినందించారు.

నాయీ బ్రాహ్మణ సంఘం

మండల కమిటీ ఎన్నిక

కడ్తాల్, మార్చి 4: తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా నీలకంఠ విష్ణు, గౌరవాధ్యక్షుడిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రకుమార్, కోశాధికారిగా రమేశ్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా పర్వతాలు, భిక్షపతి, మహేశ్, సత్యనారాయణ, శివ, వెంకటేశ్, ప్రవీణ్, రమేశ్, జగన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లు పంపిణీ చేయాలి

ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మొయినాబాద్, మార్చి 4: అర్హులైన పేద ప్రజల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే ప్రజలకు పంపిణీ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్ అన్నారు. సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలను తెలుసుకోవడం కోసం మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు ఎంపికైన లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్‌లకు ఎంపికైన లబ్దిదారులకు వెంటనే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అజీజ్‌నగర్ గ్రామంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని సూచించారు. దోమల నివారణకు స్ప్రే చేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం చేవెళ్ల డివిజన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, అజీజ్‌నగర్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్, నాయకులు యేసు, ఉస్మాన్, రాజేందర్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4 : బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్‌లో హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. కార్మికులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి గదులు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. హమాలీలు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు, ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర హరిసింగ్‌నాయక్, బీఓసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నర్సింహ, పండ్ల మార్కెట్ నాయకులు షరీఫ్, పోషన్న, కృష్ణ, గంగారావు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రైతుల సమస్యలపై పోరాడుతాం

షాబాద్, మార్చి 4: రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులంతా సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, సభ్యులు కృష్ణ, పెంటయ్య, మల్లేశ్, చెన్నయ్య, చంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు గజేందర్‌గౌడ్

రైతుల సంక్షేమానికి

నిధులు కేటాయించాలి

మొయినాబాద్, మార్చి 4 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడి అన్నారు. భారతీయ కిసాన్ సంఘం ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం జెండాను మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలను ఇచ్చిందని, వాటిని అమలు పర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంకా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. రైతులు భరోసా కింద పంట పెట్టుబడి సాయం ఏడాదికి రూ.15 వేలు ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకుండా పెండింగ్ పెట్టిందని, చనిపోయిన రైతుకు రైతు బీమా అందడం లేదని అన్నారు. పత్తి, కందుల కొనుగోలు చేయడం అంతంత మాత్రంగానే చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, బసవరాజు, వెంకటరెడ్డి, నారాయణ, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి, కాంతిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దేవతమూర్తుల విగ్రహ

ప్రతిష్ఠాపనకు విరాళం

నందిగామ, మార్చి 4: నందిగామ మండలం మొత్కులగూడ గ్రామంలో ప్రతిష్ఠిస్తున్న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50,000 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం గ్రామస్తులకు అందజేశారు. గురువారం వరకు విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

కేశంపేట, మార్చి 4: కేశంపేట మండలంలోని పోమాల్‌పల్లి – కొండారెడ్డిపల్లి గ్రామాల మధ్య వెలిసిన వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాలయ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ రామశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఫిబ్రవరి 28న దరఖాస్తులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేశారని, నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి 20రోజుల వ్యవధిలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కాకునూరు మహలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిందని, దరఖాస్తు సమయం కూడా దాటిపోయిందని పేర్కొన్నారు.

భారతదేశం ఔషధ మొక్కలకు ప్రసిద్ధి

కడ్తాల్, మార్చి 4: ఆనాది కాలం నుంచి భారతదేశం ఔషధ మొక్కల పెంపకానికి పుట్టినిల్లు అని ఆయుర్వేదిక్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్, సీజీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నీ ప్రకృతి ఒడిలో ఒక రోజు' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రావిర్యాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఔషధ మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌శర్మ మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశంలో ఔషధ మొక్కలకు ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. ఔషధ మొక్కల ఔనత్యాన్ని, వాటి ఉపయోగాలను ప్రతి ఒక్కరూ నిత్య జీవన విధానంలో భాగం చేసుకోవాలని తెలిపారు. దేశంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సీజీఆర్ వ్యవస్థాకుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి ఆయుర్వేదాన్ని పరిచయం చేసిన ఘనత భారతదేశానిదేనని తెలిపారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జగదీశ్, సీజీఆర్ సంస్థ ప్రతినిధులు రజనీకాంత్, జ్ఞానేశ్వర్, నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఆయుర్వేదిక్ ఫిజిషియన్ చంద్రశేఖర్‌శర్మ

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

నృత్య ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్, మార్చి 4: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని చదువాలని సీఐ శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వార్షికోత్సవంతోపాటు, పదో తరగతి విద్యార్థినులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ విద్యతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు చిన్నతనంలోనే ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నతంగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

ఆమనగల్లు, మార్చి 4: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమానికి సివిల్ జడ్జి స్వరూప, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మండల విద్యాధికారి పాండు, పాఠశాల యాజమాన్యంతో కలిసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 100 ప్రాజెక్టులతో విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైజ్ఞానిక వస్తు ప్రదర్శన మేళాతో విద్యార్థులకు కొత్త ఆవిష్కరణకు తోడ్పాటునందిస్తాయ్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్ మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ శంకర్‌నాయక్, ట్రస్మా సభ్యులు అల్లాజీగౌడ్, శివలింగం, సుధీర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్, వెంకటేశ్, సంజీవ్‌కుమార్, శ్రీనివాసులు, వెంకన్న, అకాడమిక్ అడ్వైజర్ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశ్, కరుణాకర్, విజేందర్, స్వప్న, అరుణ, మీన, స్వాతి, రత్నకుమారి పాల్గొన్నారు.

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామంలోని కట్టమైసమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించు